నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటా : ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

నవతెలంగాణ-కాశిబుగ్గ

కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మహిళ, యూత్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నాగరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలోని విలీన గ్రామాలను వరంగల్ నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎన్టీఆర్ నగర్



శాఖ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, ఎన్టీఆర్ నగర్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్ట నగేష్, కోశాధికారి ఆర్యూర్ కుమార్ సీనియర్ నాయకులు ఈర్ల రాజు, ఎండి నజీమా, ఓర్సు అంజయ్య, ఉబిది సారంగం, కస్తూరి భరత్, జక్కుల ప్రశాంత్, కొమ్ము వినయ్, పిట్ట సుధీర్, సాయి, రేవతి, కోమల, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

నవతెలంగాణ-వరంగల్

హన్మకొండ నయీంనగర్ నాలా వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతున్నదున కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంతాల్లో నేడు(శనివారం) నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ బిఎల్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నయీంనగర్ నాలావద్ద రోడ్డు విస్తరణ పనులకు అనుగుణంగా పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతున్న క్రమంలో కేయుసి ఫిల్టర్‌బెడ్ పరిధిలోని పబ్లిక్ గార్డెన్ ఏరియా, గుడిబండల్ ప్రాంతం కొత్తూరు, మచిలీబజార్, పద్మాక్షికాలనీ, యాదవనగర్, విద్యారణ్యపురి, హసన్‌పర్తి, భీమారం, చింతగట్టు, ముచ్చర్ల, పలివేల్పుల, వంగపహాడ్ గుండ్లసింగారం, పైడిపల్లి, గోపాలపురం, కేయూసి, జంక్షన్ ప్రాంతా ల్లో నీటి సరఫరా ఉండదని ప్రజలు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

పంటలు నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఎల్కతుర్తి



భూగర్భ జలాలు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని రైతురక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు, జిల్లా అధ్యక్షులు భాస్కర్‌డిమాండ్ చేశారు. శుక్ర వారం మండలంలోని గోపాలపురం,చింతలపల్లి గ్రామాల్లో నీరు లేక ఎండి పోతున్న వరిపొలాలను జిల్లా రైతురక్షణ సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. కెనాల్ నుండి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు.అప్పులుచేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు తీవ్రనష్టం జరుగుతుందన్నా రు. పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లు, బావులు తవ్విస్తున్నానీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వంకే రాజు, హింగే రవీందర్, రావుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు భవనాలు నిర్మించాలి

నవతెలంగాణ-పర్వతగిరి



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రంగాల్లో వెనుకబడిన మాదిగలకు జిల్లా కేంద్రాల్లో మాదిగ భవనాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ ప్రభుత్వాన్ని కోరారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్యనా యకుల సమావేశంలో మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు వర్గాలకు చెందిన పార్టీ అన్నారు. మాదిగల సంక్షేమం కోసం నిధులు కేటాయించి రాజధానిలో ఒక ఎకరంస్థలం కేటాయించి పక్కా భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి కొమ్ముల బిక్షపతి, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి వక్కల కుమార్, వర్ధన్నపేట నియోజక వర్గ ఇన్చార్జి బొట్ల రమేష్, నాయకులు బొట్ల కనకరాజు, సంకినేని సంతోష్, రాజు, బొట్ల పెద్దవెంకటేశ్వర్లు, మునిగే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సర్జరీతో దాతృత్వం చాటుకున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ కంచర్ల సుధీర్



నవతెలంగాణ-నయీంనగర్

గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 56 వ డివిజన్ కాంతయ్య నగర్ కాలనీకి చెందిన కందుకూరి బిక్షపతి కుమారుడు కందుకూరి మహేష్ రెండేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడగా కాలుఎముక విరగడంతో డాక్టర్లు రాడ్ వేశారు. గడువు పూర్తయినప్పటికీ ఆర్థిక సమస్యల వలన కాలు లోపల ఉన్న రాడ్‌ను తొలగించుకోకపోవడంతో కాలులోపల ఇన్ఫెక్షన్‌తోబాధపడుతున్నాడు. ఈ విషయాన్ని కాలనీవాసులు ఇమ్మడి రాజీవ్, ఇమ్మడి సుందర్‌లు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంకా హరిబాబు దృష్టికి తీసుకరాగ హరిబాబు వెంటనే స్పందించి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కంచర్ల సుధీర్ సహకారంతో కందుకూరి మహేష్‌కు ఉచితంగా శస్త్ర చికిత్స చేయించి రాడ్‌ను తొలగించటం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంకా హరిబాబు మాట్లాడుతూ కందుకూరి మహేష్ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితి వివరించగానే పెద్దమనసుతో అర్థం చేసుకొని ఉచితంగా శస్త్ర చికిత్స చేసినందుకు డాక్టర్ కంచర్ల సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-వరంగల్



వర్ధన్నపేట మండలం నల్లబెల్లిలో బిర్రు ఉప్పలయ్య అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందగా ఉప్పలయ్య కుమారుడు ప్రొఫెసర్ డాక్టర్ బిర్రు దేవేందర్‌ను బాల్యమిత్రులు సేవానిధి మిత్రబృందం (1988-89 టెన్త్ బ్యాచ్) సభ్యులు శుక్రవారం పరామర్శించి ఉప్పలయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. దేవేందర్ తో పాటు వారి కుటుంబ సభ్యులు నందనం సొసైటీ డైరెక్టర్ పద్మాకుమారస్వామి, డాక్టర్ రామన్న, బాబులను ఓదార్చి సానుభూతి తెలిపారు. అనంతరం సేవానిధి ద్వారా రూ.5116లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవ నిధి కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఆరెల్లి శ్రీనివాస్, గోలి కొమురయ్య, బిర్రు యాకయ్య మాజీ సర్పంచ్ ముత్యం సంపత్, బిర్రు పూలమ్మ, మాధవరెడ్డి, దేవేందర్, శ్యాం సుందర్ రెడ్డి, రమణాచారి, పంతిని మాజీ ఎంపీటీసీ ముంజచేరాలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు డాక్టర్ రమేష్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ఢిల్లీలో ఈ నెల 29, 30 తేదీ లల్లో జరుగనున్న హెర్నియా నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేం దుకు వరంగల్ చెందిన డాక్టర్ కూరపాటి రమేష్ కు ఆహ్వానం అందింది. ఈ మేరకు డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ సంక్లిష్టమైన అడ్వాన్స్ లాపరోస్కోపిక్ ఆపరేషన్స్ నూతన వైద్య విధానంపై అవగాహన సదస్సులో ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. నూతన వైద్యవిధానాల వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా, డాక్టర్ రమేష కు ఆహ్వానం అందడంపై ఐఎంఏ ప్రతినిధులు, వరంగల్ సర్జికల్ అసోసి యేషన్ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ముగిసిన ఎర్రగట్టువెంకన్న జాతర ఉత్సవాలు





- చివరి రోజు పెరిగిన భక్తుల రద్దీ
- మార్మోగిన గోవింద నామస్మరణ
- వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే నాగరాజు

నవతెలంగాణ-హసన్‌పర్తి

హసన్‌పర్తి భీమారం ఇరుగ్రామాల ఉమ్మడి ఎర్రగట్టు వెంకన్న జాతర ఐదురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగింది. హోలీపర్వదినం నుండి ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఐదురోజుల పాటు కొనసాగి శుక్రవారంతో ముగిసాయి. చివరిరోజు శుక్రవారం భక్తులరద్దీ పెరగడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి నిల్చొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపైన గండదీపానికి నూనె పోసి మా కుటుంబ సభ్యులను ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో జీవించేలా చూడాలని స్వామి వారిని వేడుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి కిషన్‌రావు, 14మంది ఉత్సవకమిటీ సభ్యులు, ఆలయ పూజారులు వేదాంతం పార్థసారథాచార్యులు ఆరుట్ల శ్రీదరా చార్యులు, విష్వక్ సేనా సమితి ప్రతినిధులు, హసన్ పర్తి వైద్య సిబ్బంది, కేయూ, హసన్‌పర్తి పోలీసులు భక్తులకు సేవలందించారు. అనంతరం పెద్ద రథలచక్రాల బండి మీద భీమారంకు చిన్నరథ చక్రాల బండి మీద అలువేలు మంగమ్మ పద్మావతి శ్రీనివాస సమేత ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా మేళతాళాలతో ఆయా గ్రామాలకు తరలించడంతో జాతర ముగిసింది.

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

శ్రీ ఎర్రగట్టు వెంకన్న జాతర ఉత్సవాలలో భాగంగా చివరి రోజు శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జీవించేలా చూడాలని స్వామి వారిని వేడుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే నాగరాజుకు ఆలయ కార్యనిర్వహణాధికారి కిషన్ రావు 14 మంది జాతర ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు వేదంతం పార్థసారథచార్యులు ఆరుట్ల శ్రీదరాచార్యులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట జాతర ఉత్సవ కమిటీ సభ్యులు ఆరెల్లి వెంకట స్వామి,కనపర్తి రాజు, విజమూరి రమణ, వేల్పుల సదానందం, ఆరెల్లి శ్రీనివాస్, పెద్దమ్మ సురేష్ , జన్ను శైలజ, మూల నారోత్తం రెడ్డి, అల్లం సాయి చరణ్ పటేల్, పెనుగుల అశోక్ కుమార్, సంగాల ప్రశాంత్ కుమార్, చల్ల సుమంత్ యాదవ్, అటికం శ్రీనాథ్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం, గొర్రె కిరణ్, గొర్రె రమేష్, పెద్దమ్మ నరసింహారాములు, ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల కుమారస్వామి, శీలం పర్వీరాజ్, పెద్దమ్మ నాగరాజు, నరసింహ రాములు, శీలం రమేష్ తదతరులు పాల్గొన్నారు.

జకోటియా కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదంలో రూ.6 కోట్ల నష్టం



- ఎస్‌బిఐ లైఫ్ రెండవ అంతస్తులో భారీగా మంటలు
- ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపు చేసిన సిబ్బంది
- సకాలంలో స్పందించిన ఫైర్, పోలీసు సిబ్బంది
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, కమిషనర్

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ నగరంలోని 22వ డివిజన్ ప్రాంత పరి ధిలోని పోచమ్మ మైదాన్ జంక్షన్ సమీపంలో గల జకోటియా షాపింగ్ కాంప్లెక్స్ ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండవ అంతస్తులో గురువారం రాత్రి భారీగా మంటలు చేలరెగాయి. మూడు ఫైర్ ఇంజన్లతో అధికారులు, సిబ్బంది దాదాపు గంటన్నరకు పైగా శ్రమించి మంటలను కాస్త అదుపులోకి తీసుకొచ్చారు. కాగా మంటలు పూర్తిస్థాయిలో అదుపులోకి రాకపోవడంతో వర్ధన్నపేట పరకాల నుండి మరో రెండు ఫైర్ ఇంజన్లను వెంటనే రప్పించి మూడు గంటల పాటు శ్రమించి మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకొచ్చారు. జకోటియాకాంప్లెక్స్‌లో జరుగుతున్న భారీ అగ్ని ప్రమాదాన్ని తెలుసుకున్న మంత్రి కొండాసురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీతాజాజీవాకడే వెంటనే ఘటన స్థలానికి చేరుకొని అక్కడి పరిస్థితిని సమీక్షిస్తూ మంటలు పూర్తిగా ఆర్పేవరకు పర్యవేక్షించారు. దాదాపు మూడు గంటలు పైగా శ్రమించిన ఫైర్స్, బల్దియా డిఆర్ఎఫ్ సిబ్బందిని, పోలీసులను ఈ సందర్భంగా వారు అభినందించారు.

అగ్ని ప్రమాదంలో రూ. 6 కోట్ల నష్టం

వరంగల్ పోచమ్మ మైదాన్ జకోటీయా కాంప్లెక్స్ లని రెండవ అంతస్తులో ఎస్బిఐ లో షార్ట్ సర్క్యూట్ తో భారీ అగ్ని ప్మాదం చోటు చేసుకోగా గురువారం నాలుగు షాపులు, రూ.3 కోట్ల ఆస్థి నష్టం జరిగింది.శుక్రవారం వరకు 2 షాపులు,కోటి రూపాయలు ఆస్తి నష్టం మొత్తం అరు కోట్ల నష్టం, అరు షాపులు అగ్నిలో ఆహుతి అయ్యాయని మట్టెవాడ సీఐ తెలిపారు.

దర్గాలో అక్రమ వసూళ్లను అడ్డుకున్న గ్రామస్తులు

- సదరు కాంట్రాక్టర్‌పై గ్రామస్తుల ఆగ్రహం



నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ప్రముఖ యాత్రా స్థలమైన అన్నారం షరీఫ్ యాకూబ్‌షా వలీబాబా దర్గాలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎంక్వైరీ చేసి సంబంధిత కాంట్రాక్టర్ పై వక్ఫ్ బోర్డ్ ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.శుక్రవారం దర్గాలో జరుగుతున్న అక్రమ వసూళ్లను స్థానికులు అడ్డుకున్నారు. పవిత్రమైన అన్నారం షరీఫ్ దర్గాలో భక్తుల వద్ద అక్రమవసూళ్లకు పాల్పడ్డ కాంట్రాక్టర్ ఆగడాలపై ఎంక్వైరీ చేసి తక్షణమే కాంట్రాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌తో చేతులు కలిపిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్ర, ఆదివారాల్లో వచ్చే భక్తులను పలు ఇబ్బందులకు గురిచేస్తూ ముక్కుపిండి మరీవసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దర్గాలో జరుగుతున్న అక్రమ వసూళ్ల ఆగడాలను నియంత్రించి భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గొడుగు బిక్షపతి, సారంగపాణి, రమేష్, గాడిపెల్లి రాజబాబు, అఖిల్, రాపోలు రవి, గొడుగు వినయ్, విజేందర్, విశాల్, హేమంత్, మణికంఠ, దిలీప్, గజ్జి మహేందర్, దయాకర్,విజయ్,గ్రామస్తులు,యువజన సంఘాలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-వేలేరు



రోడ్డుపై నిర్లక్షంగా పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతూ మృ తి చెందారు. వేలేరు ఎస్ఐ హరిత కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన తొట్టె కుమార్ (37) తన స్వంత పనిమీద ద్విచక్ర వాహనంపై ఈనెల 25న మల్లికుదుర్లకు వెళ్లి తిరిగి జానకీపురం వస్తున్న క్రమంలో మల్లికుదుర్ల సమీపంలో రోడ్డుపై నిర్లక్షంగా పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108లో చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. యశోదలో చికిత్సపొందుతున్న కుమార్ గురువారం మృతిచెందారు. వాహనాలు రోడ్ మీద నిలిపిన జానకీపురంకు చెందిన యాట గణేష్, కావటి కిట్టు, ముద్దెమరి అఖిల ద్విచక్ర వాహనాలను రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచినట్లు తెలిపి వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రవళి ఇచ్చిన ఫిర్యాదుమేరకు శుక్రవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేటీఆర్‌పై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-గీసుగొండ

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ పై చట్టపైన చర్యలు తీసుకొని ఆయన పైన కేసులు నమోదు చేయాలని పరకాల కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమురా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చాడ కొమురారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రుద్ర ప్రసాద్‌లు మాట్లాడుతు రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒంటరిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విచ్చేసి గెలుపులో ముఖ్యపాత్ర పోషించిన గొప్పవ్యక్తి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్య క్రమంలో మండల యూత్ ప్రధాన కార్యదర్శి కూసం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జావిద్, కందుల అశోక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు చదువుతోపాటు ప్రశ్నించే తత్వాన్ని నేర్చుకోవాలి

- ఎస్ఎఫ్ఐ 2024 నూతన డైరీ ఆవిష్కరణలో బొట్ల చక్రపాణి

నవతెలంగాణ-హన్మకొండ



విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయలు, అక్రమాలపై ప్రశ్నించడం నేర్చుకోవాలని సీపీఎం హనుమ కొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. శుక్రవారం రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ 2024 సంవత్సర డైరీని అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుంది అన్నారు. ప్రభుత్వ విద్య సంస్థలలో చదువుకునే విద్యార్థులకు కనీస మౌలిక వసతును ఈ ప్రభుత్వాలు కల్పించడం లేదన్నారు. విద్యార్థులు విద్య రంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. వారు చదువుతోపాటు ఈ సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలపై ఎప్పటి కప్పుడు ప్రశ్నించడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు గొడుగు వెంకట్, తిరుపతి కుమారస్వామి, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ స్టాలిన్, జస్వంత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లా దయతో అందరు సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే నాయిని

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ముస్లింలకు పరమ పవిత్రమైనది రంజాన్ మాసంలో కులమతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలగాలని అల్లా దయతో అందరు ఆయురారోగ్యాలతో,సుఖశాంతులతో ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాజేందర్‌రెడ్డి జక్రియ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి ముందస్తుగా అందరికి అడ్వాన్సు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీలు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఓ పండుగ వాతావరణంలా జరుపుకునే అత్యంత పవిత్రమాసం మాహే రంజాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, టిపిసిసి కార్యదర్శి ఈవి.శ్రీనివాస్ రావు, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్‌రావు, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మొహమ్మద్ ఇస్మాయిల్ శంషి, మౌలానా ఫసిఉద్దీన్, మగ్దూం, నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్లు మహమ్మద్ ఆయుబ్, ముజాహిద్, సమీ మహమ్మద్ మిర్జా అజీజుల్లా బేగ్, టిపిసిసి సోషల్ మీడియా కార్యదర్శి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, మొహమ్మద్ జాఫర్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు సయ్యద్ వలిఉల్లాఖాద్రీ, ఎస్‌కే.అమర్, ఖాజా మొయినుద్దీన్, నసీర్, అంకుష్, గుఫ్రాబ బాబా, మస్జిద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్‌యాదవ్, సయ్యద్ రాజాలి, చీకటి శారద ఆనంద్, బాబ్ భాయ్, మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

నవతెలంగాణ-కమలాపూర్



అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్ర రావు తెలిపారు. శుక్రవారం ఎస్సై వీరభద్రరావు తమ సిబ్బందితో కలిసి పక్క సమాచారం మేరకు వంగపల్లి గ్రామానికి చెందిన పంజాల వెంకన్న కిరాణం షాపును తనిఖీ చేయగా రూ.4870 లు విలువ గల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. పంజాల వెంకన్నను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు కూడా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, ఒకవేళ అలాంటి చర్యకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై వీరభద్ర రావు వెంట హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ తదితరులు ఉన్నారు.

వేలేరు : మండలంలోని గుండ్ల సాగర్ గ్రామంలో అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న వ్యక్తిని అందులోకి తీసుకొని రూ.5,379లు విలువగల మద్యంను పోలీసులు శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగ ఎస్సై డి.హరిత వివరాలు తెలుపుతూ హెడ్ కానిస్టేబుల్ వి.వెంకటయ్య, పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొండకింది రాజమణి భర్త సత్తిరెడ్డి తన కిరాణా దుకాణంలో అనుమతులు లేకుండా అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కువ లాభాలు గడించాలనే ఉద్దేశంతో అక్రమ మద్యం వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

క్రషర్లు మూసివేయాలని రైతుల ఆందోళన



నవతెలంగాణ-శాయంపేట

అప్పులు తెచ్చి పంట సాగు చేయగా క్రషర్ నుండి వెలువడే దుమ్ము ధూళితో పంట నష్టపోయి, పంట సాగుకు పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో కడుపు మండిన రైతన్నలు రోడ్డెక్కారు. క్రషర్లు మూసివేయాలని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుగ్యాల రజనీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రషర్ కు వెళ్లే దారిలో ఆందోళన చేపట్టారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామ శివారులోని బాలాజీ, ఈ ఆర్ ఆర్ క్రషర్లకు వెళ్లే దారిలో గ్రామ రైతులు ఉడుత మహేందర్, రాజయ్య, శ్రావణ్ కుమార్, దాసి వీరేశం, బైరి సంతోష్, శంకర్, గిరి, ఆకుతోట సంతు, పంచగిరి చంద్రయ్య, బొత్త రామయ్య, ప్రసన్నకుమార్ తోపాటు మరికొంత మంది రైతులు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దుగ్యాల రజనీకాంత్ తో కలిసి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. క్రషర్లను మూసివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ రైతులు అప్పులు తెచ్చి పంట సాగు చేస్తుండగా, క్రషర్ల నుండి వచ్చే దుమ్ము, ధూళితో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లి, పంట సాగుకు పెట్టిన పెట్టుబడి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీలలో బోర్ బ్లాస్టింగ్లు చేపట్టడం వల్ల పంట పొలాల్లో పనిచేయడానికి భయపడి కూలీలు రావడంలేదని, బ్లాస్టింగ్లతో సమీప గ్రామంలోని ఇండ్లు బీటలు వారుతున్నాయని అన్నారు. క్రషర్ యజమానులు అక్రమంగా రైతుల భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తహసిల్దార్, జిల్లా కలెక్టర్ లు స్పందించి క్రషర్ల పై సమగ్ర విచారణ చేపట్టి క్రషర్లను మూసివేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్కు మెమోరాండం సమర్పించనున్నట్లు రైతులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తుల అరెస్టు

నవతెలంగాణ-హన్మకొండ / ఎన్జీవోస్ కాలనీ

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఒక ముఠాను హనుమకొండ సుబేదారి పోలీసులు పట్టుకున్నారు. శనివారం హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి సుబేదారి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. శుక్రవారం హనుమ కొండ అదాలత్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారించగా అతని పేరు వీరేశమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్రూప్-1 జాబ్స్ ఇప్పిస్తామని అమాయక ప్రజలు మోసం చేస్తూ వారి వద్ద నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని మోసం చేసిన విషయం వెల్లడించారు. అలాగే వరంగల్ పిన్నవారివీధికి చెందిన కొత్త వీరేశంను గురువారం అరెస్టు చేసి విచారించగా 9 మంది సభ్యులతో కూడిన ఒక టీం ఏర్పరచుకొని ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు వసూలు చేశారన్నారు ఇందులో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం ఆంధ్రప్రదేశ్ వ్యక్తులు ఉన్నారన్నారు .వీరేశం రూ.4.50 కోట్లు డబ్బులు వసూలు చేసి రూ.1.5 కోట్లు వీరేశం తీసుకొని మిగతా డబ్బులు 8 మంది సభ్యులు పంచుకున్నారని విచారణలో తెలిపారు. 2020 సంవత్సరంలో వారం శ్రీదేవి భర్త భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ వద్ద సుమారు రూ.2.5 కోట్ల డబ్బు తీసుకొని తన కుమారునికి గ్రూప్-1 ఏపీపీఎస్సీ నందు జాబ్ పెట్టిస్తాను అని తనకు పెద్ద పెద్ద పోలీస్ ఆఫీసర్ లు, పొలిటికల్ లీడర్లు తెలుసు అని మభ్యపెట్టి డబ్బులు తీసుకున్నాడన్నారు. కొత్త వీరేశం, ఇంకా కొంతమంది వ్యక్తులతో కలిసి ఇలాంటి



మోసాలకు పాల్పడ్డారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్ద చిన్న, చిన్న పైరవీలు చూసుకుంటూ బ్రతికేవాడని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆశపడి ఒక్కడితోనే అనుకున్నది సాధ్యం కాదని, కొడుకు గోపీనాథ్ తెలి సిన మిత్రుడైన గూడూరు పవన్కుమార్ అతని భార్య గూడూరు వెంకట పద్మజ కలి సి ఒక టీంగా ఏర్పడి రెండు తెలుగు రాష్ట్రాలలో కొందరు రాజకీయ ప్రముఖు లతో కొందరు పోలీస్ అధికారులతో పరిచయం ఉన్నట్లుగా అందరికి చెప్పుకొని గూడురు పవన్కుమార్ మామ అయిన ప్రతిమ హాస్పిటల్ లో డా క్టర్గా పనిచేస్తున్న బొమ్మన రఘునందన్రావు బోయినపల్లి రవీందర్ రావు, గూడూరు పవన్ కుమార్ తన కు పరిచయం చేశారన్నారు. ఈ బోయినపల్లి రవీందర్రావుకు ప్రతిమ మెడికల్ కాలేజ్ యజమాని శ్రీనివాస్రావు బంధుత్వం సాన్నిహిత్యం ఉన్నందున ఇతనికి అ ప్పటి తెలంగాణ పొలిటికల్ పార్టీతో, పోలీస్ ఆఫీసర్స్ లతో అత్యంత సన్నిహితుడని అతనితో ఏమైనా పనులు చేయించుకోవచ్చునని రవీందర్రావు ద్వారా డాక్టర్ రఘునందన్ రావుని వీరేశం పరిచయం చేసుకున్నారన్నారు.

ప్రభుత్వ శాఖలో ఉన్నతాధికారులు మాకు తెలిసిన వారు ఉన్నారని అందరికి ప్రచారం చేసుకున్నారన్నారు. దాని వలన ఎవరినైనా నమ్మించి మోసం చేసి డబ్బులను సంపాదించవచ్చు అనుకున్నారు. చాలాడబ్బు ఉన్న వారిని పరిచయం చేసుకొని ఉద్దేశ పూర్వకంగా మోసం చేయాలనే ఉద్దేశంతో వాళ్లకు ప్రభుత్వ డిపార్టుమెంటులో ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పితే వాళ్ళు నమ్ముతారని అనుకోని ఆవిధంగా చెప్పుకున్నారన్నారు పవన్ కుమార్కు బంధువు అయిన ఉటుకురి శ్రీనివాస రావు అడ్వకేట్ లీగల్గా మాకు సహకరిస్తూ ఆంధ్రప్రదేశ్ లో పొలిటికల్ పార్టీలతో మంచి సంబంధాలు ఉన్నటువంటి బుచ్చిబాబు, ఎ.బుచ్చయ్య ఈ ఉద్యోగాలు ఇప్పించటంలో సహకరించారన్నారు. తన వద్దనే కాకుండా ఇంకా కొంత మంది దగ్గర కలిపి మొత్తం సుమారు రూ.4,50,00,000 వరకు డబ్బులు తీసుకున్నాడు.

ఆయన వద్ద వున్న ఒక మొబైల్ ఫోన్ పోలీస్ వారు స్వాధీన పరచుకోగా నిందితుడు సంపాదించిన డాక్యుమెంట్స్ ను మరియు గోల్డ్, నగదు డబ్బును సీజ్ చేసినట్లు తెలిపారు.

మానవాలి రక్షకుడు యేసు

జిల్లాలో ఘనంగా గుడ్ఫ్రైడే వేడుకలు



నవతెలంగాణ-ధర్మసాగర్

ఈ లోకంలోని మానవుల రక్షణ కోసం రక్షకుడైన ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించి పాపాలను కడిగివేసి పరలోక వారసులుగా చేశారని ఫాదర్ జోసఫ్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ నుండి సహాయం మాతకొండ వరకు ఏసుక్రీస్తు 14 స్థలాల స్మరణ పాటుల చరిత్రను ప్రజలు భక్తిశ్రద్ధలతో నడిచి వెళ్లారు. ఏసుక్రీస్తు పడిన శ్రమలను ఈ 14 స్థలాలలో స్మరణ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు జోసెఫ్ మాట్లాడుతూ. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకుని యేసుక్రీస్తు జీవితంలోని ఆదర్శాలను ప్రజలందరూ స్మరించుకున్నారు. ఒకరికి మంచి చేయడంలోనే ఎంతోఆత్మసంతృప్తి ఉంటుందనే సందేశాన్ని యేసు క్రీస్తు జీవితం మనకు అందిస్తుందని తెలిపారు. క్రీస్తుజీవించిన కాలం ఆధారంగా మానవ చరిత్రను క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం అని విభజించేంతగా ఈ భువి పై క్రీస్తు ప్రభావం ఉంటుందన్నారు. క్రీస్తు ఆచరించి ప్రేమ, సహనం, కరుణ, త్యాగం అనే గుణాలను నిత్య జీవితంలో ఆచరించి అశాంతితో కొట్టుమిట్టాడుతున్న సమాజానికి క్రీస్తు బోధనలు సరైన దారి చూపుతాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సంఘస్తులు ఉపదేశి మరకన్యలు, గ్రామపెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఊరుగొండలో సిలువ యాత్ర



దామెర : మండలంలోని ఊరుగొండ లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన 2వేల మంది ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగారపు సురేష్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడేని శుభ శుక్రవారం అంటారని ప్రభువైన ఏసుక్రీస్తు తన భుజాలపై సిలువను మోస్తూ మన పాపాల విముక్తి భారంమోసి లోక రక్షకునిగా ఆయన చేసిన త్యాగ ఫలితమే శుభ శుక్రవారం గుడ్ ఫ్రైడే అంటారన్నారు. అనంతరం పాటలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక, ధ్యాన, మౌన, పాప పశ్చాత్తాప పరివర్తన భావాలతో అర్థవంతంగా కార్యక్రమం జరిగింది . యువత, మహిళలు, బాలబాలికలు సకల మానవాళి పాప పరిహారం కొరకు లోక రక్షకుడైన యేసు క్రీస్తు మోసిన సిలువను అనుభవించిన భయంకంమైన మరణ వేదనను నాటక రూపంలో ప్రదర్శించినారు. ఈ నాటక ప్రదర్శన యాత్ర అందరి హృదయాలను కదిలించినది.

ఈ కార్యక్రమంలో ఫాదర్ తాటికొండ జోసఫ్, ఫాదర్ కిరణ్, ఉపదేశీ పూలేపాక మొగిలి, సంఘ పెద్దలు జన్ను నరసయ్య, జన్ను సల్మాన్, జన్ను కుమారస్వామి, రూప, ఆకిర్లరాణి, జన్ను కోమల, శ్యామల, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-వరంగల్

ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు కేటాయించిన ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వలెన్స్ స్క్వాడ్ , ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికలకు నియమించిన బందాల విధులు, బాధ్యతలు, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతరం కేటాయించిన విధుల నిర్వహణ, ఈఎస్ఎంఎస్ అప్లికేషన్, సీ విజిల్ ఆప్ తదితర అంశాలపై జిల్లా వ్యయ పరిశీలకులు అవగాహన కల్పించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, అన్ని పార్టీల అభ్యర్థుల పట్ల నిబంధనలకనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు గురికావాల్సి వస్తుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా నగదు, మద్యం ఇతర వస్తువుల పంపిణీ పై ప్రత్యేక దష్టి కేంద్రీకరించాలన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి పుష్పలత ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్టాటిస్టికల్ సర్వేలెన్సు బృందాలు, ఎన్నికల వ్యయ బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



తాడిచెర్లలో ఘనంగా గుడ్ ఫ్రైడే

నవతెలంగాణ-మల్హర్రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రార్థన మందిరాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవులు అంగరంవైభవంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువపై ప్రాణాలర్పించిన రోజును గుడ్ ఫ్రీడే గా జరుపుకుంటారని పాస్టర్ సుబాకర్ వివరించారు. శత్రువులను కూడా ప్రేమతో క్షమించాలని బోధించిన మహానియు డిగా ఏసుక్రీస్తు కీర్తి ఘడించాడని తెలిపారు. 40 రోజులపాటు ఉపవాస దీక్షను శుక్రవారం ముగించారు.



ఉపాధి కూలి రూ.28 పెంపు



ఏప్రిల్ 1 నుంచి అమలు
మండలవ్యాప్తంగా
11,079మంది కూలీలకు లబ్ది

నవతెలంగాణ-మల్హర్రావు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలకు ఈ వేసవి నుంచి కూలి పెరగనుంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి కొత్త వేతనం అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రోజుకు రూ.272 అందుతున్న కూలి రూ.300కు పెరగనుంది. ఈ నిర్ణయంతో మండలంలో 11,079మంది కూలీలకు లబ్ది చేకూరనుంది. అయితే కూలీలకు మూడేళ్ళుగా వేసవి భత్యం ఇవ్వకపోగా ఈసారి కూలి పెంపుతో సరిపెట్టారు.

ఉపాధిహామీ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే సాఫ్ట్ వేర్ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుని పని దినాల లక్ష్యాలు కేటాయింపులను పర్యవేక్షి స్తుంది. పనులకు వచ్చే కూలీల సంఖ్య ఆధారం గా గ్రామం, మండలం, జిల్లా లక్ష్యాలను నిర్దేశి స్తుండగా రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని పనిదినాలు పెంచేది. మూడేళ్ళుగా ఈ లక్ష్యాల మేరకు కూలీ లకు పనులు కల్పిస్తున్నారు. ఉపాధిహామీలో మార్పు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఏటా మాదిరిగానే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయించింది.ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలో రూ.28 కు పెంచింది. గత సంవత్సరం రూ.15 మాత్రమే పెంచగా ఈసారి ఇంకాస్త ఎక్కువ పెంచగా కొత్త వేతనం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయంలో ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీల సంఖ్య మండలంలోని 15 గ్రామాల్లో ఎక్కువగానే ఉన్నారు.ఈ పనులను కూలీల కుటుంబాలు వినియోగించుకుంటున్నారు. కాగా ఈ ఏడాది ఉపాధి పనులకు 11,079 మంది కూలీలు వెళ్లినట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.


వేసవి భత్యం లేనట్టే...

కూలీలకు వేతనాలు పెంచిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా వేసవి భత్యాన్ని ప్రస్తావించలేదు. ఏటా వేసవిలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు వేసవి భత్యం ప్రత్యేకంగా చెల్లించేవి గత మూడేళ్ళుగా ఇది అందకపోగా ఈ సారి కూడా మొండి చేయి చూపారు.అయితే కూలీలకు తాగునీటి సరఫరా కోసం గ్రామపం చాయితీలకు నీదులు విడుదల చేస్తోంది.ఒక్కొక్క కూలికి రూ.2.50 చొప్పున కేంద్రం చెల్లించే నిధులతో పని ప్రదేశాల్లో తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుంది.

ఈ ఏడాది మండలంలో పనుల వివరాలు...

15 గ్రామపంచాయతీల పరిధిలో 8,441 కాగా జాబ్ కార్డులు, 18,752మంది కూలీలు ఉన్నారు. 5,678 యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా11,079మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ఈ ఏడాది కూలీల వేతనాలు రూ.3.91 కోట్లు, సామగ్రి వ్యయం రూ.91 లక్షలు మొత్తంగా రూ.4.91 కోట్లు చెల్లించారు.

బాలిక విద్య సాధికారిత యాత్ర



నవతెలంగాణ-మహాదేవపూర్

బాలిక విద్య సాధికారితపై బీజూ చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర 89వ రోజు శుక్రవారం మహాదేవపూర్కు చేరింది. దేశ వ్యాప్తంగా 800 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో బాలిక విద్య సాధికారిత పై బీజూ బాలబాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం బాలికల సాధికారిత కోసం యాత్ర చేపట్టిన బీజూను మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు అభినందిస్తూ ఘనంగా శాలువాతో సన్మానించారు. బాలికలు పురుషులతో సమానంగా విద్య ను అభ్యసించాలని, విద్యలో బాలికలు ముందుంటే సమాజం బాగుంటుందని మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు.

భద్రాద్రి సీతారాముల తలంబ్రాలు పంపిణీ



నవతెలంగాణ-గణపురం

భద్రాద్రి సీతారాముల కళ్యాణం తలంబ్రాలను గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో శ్రీరామదాసు భక్తమండలి ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అర్చకుల మంత్రోచ్చరణల మధ్య రాములోరి తలంబ్రాలను నిక్షిప్తం చేసి గుండా సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. చెల్పూర్కు చెందిన శ్రీ రామదాసు తిరుపతి తిరుపతమ్మ స్వంత వరి పొలంలో పండించిన వడ్ల గింజలను చేతి గోటి వేళ్ళతో వొలిచారు. వాటినే నేరుగా సీతారామచంద్రస్వామి తలంబ్రాలకు ఉపయోగిస్తారు. వాటిని లెంకలపల్లి రమేష్, యాసాని వెంకటేశ్వర్లు, శ్రీపతిశ్రీనివాస్, సంకటి రవిందర్, అంకిరెడ్డిరవి, రేగూరికిరణ్, సూదిపాక వెంకన్నబాబు సమక్షంలో ముత్యాల తలంబ్రాలు ప్రజలకు అందజేస్తారు.

బాధిత కుటుంబానికి అండగా అయిలి మారుతి



నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండల కేంద్రంలోని సలేంద్రపు పోచయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి పరామర్శించి రూ.2000 ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషణ, జాడి గట్టయ్య, గడ్డం దుర్గయ్య, జోడు మల్లయ్య, గడ్డం స్వామి,రేగుల భాస్కర్, జోడు మహేష్, అట్టెం రాజేందర్, యూత్ ఇన్చార్జి చింత కింది రాజు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-మహాదేవపూర్

నేడు కాటారం 132 కేవీ సబ్ స్టేషన్ మరమతుల కారణంగా మహదేవపూర్, కాటారం కొయ్యూరు, పలిమెల మండలాల్లోని సబ్ స్టేషన్ పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారు లు సహకరించాలని కోరారు.

గిరిజనులకు అందని పల్లె వైద్యం !



వెలవెలబోతున్న ఆయుష్మాన్ భవనాలు
నిధులున్నా పనులు శూన్యం

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో సైతం గిరిజనులకు, పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరిట పల్లె దవాఖానాలను ప్రవేశపెట్టింది. మొదలుపెట్టి నాలుగేళ్లు అవుతున్నా పనులు నత్తకు నడకనేర్పినట్లుగానే ఉన్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో చేపట్టిన పనులు అసంపూర్తిగా కొట్టుమిట్టాడుతున్నాయి. ములుగు జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధి ఇంజనీరింగ్ విభాగం ద్వారా పనులు చేపట్టడానికి గాను 35 పల్లె దవాఖాన భవనాలకు కేంద్రం నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా నిధులు మంజూరు అయ్యాయి. ఒక్కో భవనానికి రూ. 16లక్షలు కేటాయించింది. 2019లోనే టెండర్లు పూర్తి అయినప్పటికీపనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించారు. నాలుగేళ్ల పూర్తి కావస్తున్నా పది భవనాలు మాత్రమే పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చాయి. మిగతా 25 భవనాలు మాత్రం అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొన్ని భవనాలు మాత్రం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రంగులు దిద్దినప్పటికీ ప్రహరి నిర్మాణం, బాత్రూమ్లు, విద్యుత్, నీటి సౌకర్యం పనులు ఇంకా చేపట్టలేదు. దాంతో భవనం పూరైనప్పటికీ వసతులు కల్పించకపోవడంతో భవనాలు వెలవెలబోతున్నాయి. ఐటీడీఏ ఇంజనీరింగ్శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు నివేదికలను సంబంధిత ఐటీడీఏలోని వైద్య ఆరోగ్యశాఖ కు అందించాల్సి ఉంది. కానీ అదేమి జరగడం లేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం పరిశీలిస్తే ఇంజనీరింగ్శాఖలోని నిధులు అధికారులు దేనికైనా వాడుకున్నారా... లేక పనుల పేరుతో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏటూరునాగారం మండలంలోని అల్లంవారిఘణపురం సమీపంలో పనులు చేపట్టిన పల్లె దవఖాన భవనం రెండేళ్లయినా పూర్తి కాలేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా భవనం పూర్తి చేశాడు. కేవలం రంగులు వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. ప్రహరితోపాటు భవనంలో ఉండాల్సిన కనీస వసతులు కూడా చేపట్టలేదు. దాంతో భవనం వైద్య సేవలకు ఉపయోగపడటం లేదు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె వైద్యానికి రూపం లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో కేవలం పీహెచ్సీ కేంద్రాల నుంచి చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వైద్యం పొందాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని గిరిజనులకు అందుబాటులోకి తీసుకురావాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా..

వరంగల్ పార్లమెంట్
ఎంపీ అభ్యర్థి రమేష్

నవతెలంగాణ -భూపాలపల్లి టౌన్

ఆదరించి గెలిపిస్తే హైదరాబాద్ వరంగల్ పట్టణాలకు దీటుగా భూపాలపల్లిని అభివృద్ధి చేస్తానని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఆరు రమేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్లో ఏఎస్ఆర్ గార్డెన్లో బూత్స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి మోరే రవీందర్ అధ్యక్షత వహించగా రమేష్ హాజరై మాట్లాడారు. భూపాలపల్లికి రైల్వే కారిడార్ తోపాటు గూడెపాడు నుండి పరకాల భూపాలపల్లి మీదుగా సిరొంచ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే లైన్ రహదారుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర అధికార



ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడు నూతల నిశిధర్రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజమౌళిగౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, పాపన్న అర్జున్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజెవైఎం జిల్లా అధ్యక్షుడిగా రాయంచు నాగరాజు



నవతెలంగాణ - ములుగు

బీజేవైఎం ములుగు జిల్లా అధ్యక్షుడిగా ములుగు పట్టణానికి చెందిన రాయంచు నాగరాజును జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శుక్రవారం నియమించారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య



కార్యకర్తల సమావేశంలో బలరాం హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి నిత్యం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తూ నాటి నుంచి నేటి వరకు సమస్యలపై పోరాడుతున్న రాయంచు నాగరాజును జిల్లా అధ్యక్షుడిగా నియమించి,నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం రాయంచు నాగరాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా, మండల స్థాయి నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ రాబోయే మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి విజయానికి కృషిచేస్తానని అన్నారు.

రిజర్వాయర్ల నిర్లక్ష్యానికి గత ప్రభుత్వమే కారణం

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



నవతెలంగాణ-దెస్క్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదం కారణంగానే పాలకుర్తి, చెన్నూర్ రిజర్వాయర్ పనులు పూర్తికాకుండా నిర్లక్ష్యానికి గురయ్యాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను సందర్శించి పనులను పరిశీలించారు. చెన్నూరు రిజర్వాయర్ పనుల గురించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో రిజర్వాయర్ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. మండలంలోని అయ్యంగారిపల్లి, ఈరవెన్ను వావిలాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు రాజీనామా చేసి సుమారు 150 మంది ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన కార్యకర్తలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రెడ్డి



నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని రామన్న గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రాజయ్య-కేతమ్మల కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు సురేష్ నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మూలమలుపులో ముళ్లకంపలు..!

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని రామవరం చెరువు కట్ట ప్రవేశం మూలమలుపు చివరలో కంప చెట్లు పెరిగి రోడ్డును కమ్మేశాయి. దీంతో ప్రయాణికులు వాహనం ద్వారా ఆ ప్రదేశానికి వెళ్లగానే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. మూలమలుపు కావడం... ముళ్లకంపలు కమ్మేయడంతో ఏ వెహికల్ వస్తుందో కనపడని పరిస్థితి నెలకొంది. ఈ రహదారి గుండా నిత్యం తొర్రూర్ టు హైదరాబాద్, హైదరాబాద్ టు తొర్రూర్ ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలు, టూ వీలర్స్ వాహనాలు నడుస్తుంటాయి. ఏపుగా పెరిగిన ముళ్లకంపలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి చెరువు కట్ట మూలమలుపులో ఉన్న కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచులు

నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని రేగుల, లక్ష్మక్కపల్లి ఏడునూతల రామవరం గడగుట్ట తండా గ్రామాల మాజీ సర్పంచులు వారితో పాటు సుమారు 100 మంది బీఆర్ఎస్‌కి రాజీనామా చేసి పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కొత్తగా పార్టీలో చేరికలపై నాయకులు, కార్యకర్తలు, ఆందోళన చెందవద్దని అందరినీ కాపాడుకుంటాం మీరంతా యశస్విని ఝాన్సీ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నారు. మా విజయం గెలుపు కోసం కష్టపడిన నాయకులకు కార్యకర్తలకు అందరికీ కాంగ్రెస్‌తో పాటు మా కుటుంబం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, బ్లాక్ అధ్యక్షులు, వివిధ మండల అధ్యక్ష కార్యదర్శులు, పార్టీ ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలి

- జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ మాదిగలకే ఇవ్వాలని, మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగే ప్రమాదముందని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మారపాక రవి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో విలేకరుల సమావేశంలో రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాలకుగాను ఇప్పటికే రెండు మరో వర్గానికి ఇవ్వగా మాదిగలకు అవకాశం రాలేదని, కనీసం వరంగల్ స్థానాన్ని అయినా పార్టీ అధిష్టానం మాదిగలకు అందించి మాదిగ సామాజిక వర్గానికి సముచిత స్థానం గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని కోరారు. గత ప్రభుత్వం మాదిగలను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు సరైన ప్రాధాన్యత ఇస్తుందనే నమ్మకంతో మాదిగలు ఆశతో ఉన్నారని అన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని మాదిగలకు అందించి మాదిగల అస్తిత్వానికి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానంపై ఉందన్నారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంటు స్థానం మాదిగలకు కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా అందిస్తామని, తద్వారా రానున్న రోజుల్లో పార్టీకి ఎంతో మేలు జరుగుతుందన్నారు.



రేషన్ బియ్యం పట్టివేత

- ట్రాలీ ఆటో స్వాధీనం

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని సాల్వాపూర్ గ్రామ శివారులోను పెట్రోలింగ్‌లో భాగంగా పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై కంక్కల సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు మాట్లాడుతూ సాల్వాపూర్ గ్రామానికి పెట్రోలింగ్‌లో భాగంగా వెళ్లి వస్తున్న క్రమంలో మహేంద్ర ట్రాలీ ఆటోలో 14 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. యాదాద్రి జిల్లా రాజపేట మండలం పుట్ట గూడెంకు చెందిన డ్రైవర్ భూక్య రమేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్‌కు సన్మానం



నవతెలంగాణ-నెల్లికుదురు

నేషనల్ ఎస్టీ కమిషన్ మెంబర్ బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జటోత్ హుస్సేన్ నాయక్ నియామకం అవడం పట్ల ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం బీజేపీ పార్టీ శ్రేణులు మదన్‌లాల్, చందు రాజ్ కుమార్ యాదవ్, నల్లని జిలకర యాకయ్య, ప్రభాకర్ రెడ్డి, వీరయ్య, వివిధ గ్రామాలకు చెందిన వారు మహబూబాబాద్ వెళ్తున్న క్రమంలో అంబేద్కర్ సెంటర్ వద్ద శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి... ఇతర పార్టీలోకి వెళ్లాలి...

- బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

కడియం శ్రీహరి నియోజకవర్గ శాసనసభ సభ్యత్వానికి, బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తర్వాతనే పార్టీ మారాలని శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కడియం దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ మాట్లాడుతూ నాటి స్వ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి ఉద్యమాన్ని అణిచివేసి, నాయకులు,కార్యకర్తలు, విద్యార్థి ఉద్యమకారులపై కేసులు పెట్టించిన తెలంగాణ ద్రోహిగా ముద్ర వేసుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో చేరి 2014లో కేసీఆర్ నమ్మి ఎంపీ టికెట్ ఇవ్వడమే కాకుండా, భారీ మెజార్టీతో గెలిపించుకోవడం జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు, ఎమ్మెల్సీగా కూడా ఇచ్చారని, మొన్నటికి మొన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని ప్రగల్భాలు పలికి, రాజీనామా చేయకుండా ఎలా వెళ్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి మళ్లీ ఇతర పార్టీలో వెళ్లిపోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంభం కుమారస్వామి, పొన్న రంజిత్, సంజీవ, అకారపు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘనపురం : బీఆర్ఎస్ పార్టీ ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ మారడం కాదు... ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీ మారాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు గట్టగల్ల శ్రీవారి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత కేసీఆర్‌ను నమ్మించి మోసం, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ప్రజలను ద్రోహం చేసిన కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళిత వ్యతిరేకి కడియం మోసకారి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

యశ్వంతాపూర్ ఏరుపై బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు..!?

- పాలకుర్తి-జనగామ బీటీ రోడ్డు విస్తరణ జరిగి ఐదేళ్లు
- ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలవుతున్న ప్రజలు



నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

పాలకుర్తి నుండి జనగామ వరకు గల 35 కిలోమీటర్ల రోడ్డు డబుల్ బీటీ రోడ్డుగా విస్తరణ జరిగి ఐదేళ్లు. రోడ్డు విస్తరణ సందర్భంగా రహదారిపై ఉన్న కల్వర్టులన్నీ కూడా చిన్న, పెద్దవి నిర్మాణం చేశారు. చివరకు కుందారం కాసిం కుంట, చీటూరు ఊర చెరువు మత్తడి పై కూడా పైపుల ద్వారా కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు.

కుందారం నెల్లుట్ల మధ్యగల పటేల్ గూడెం స్టేజి వద్ద యశ్వంతాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని నిర్లక్ష్యంగా వదిలిపెట్టారు. ఇదే యశ్వంతపూర్ వాగు రైల్వేబ్రిడ్జిపై 1954 లో రైలు ప్రమాదంలో 300 మంది ప్రయాణికులు జలసమాధి అయ్యారు. అత్యంత ప్రమాదకరంగా ఉధృతంగా ప్రవహించే ఈ వాగుగుండా జనగామ నియోజకవర్గంలోని దేవరుప్పుల, తొర్రూరు, కోడకండ్ల, పాలకుర్తి మండలాలకు చెందిన అనేక మంది ప్రజలు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. లింగాలగణపురం మండలానికి చెందిన కుందారం, చిటూరు గ్రామాల ప్రజలు కూడా ఇదేదారి గుండా ప్రయాణించ వలసి ఉంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రయాణికులను బ్రిడ్జి వైపు పోకుండా పోలీసులు పహార కాసిన సందర్భంలో కలెక్టర్ కూడా స్వయంగా స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. గతంలో హామీ ఇచ్చిన అధికారుల, పాలకుల హామీలు నెరవేరలేదని, రానున్న వర్షాకాలం లోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బ్రిడ్జి కాలేదు :



యశ్వంతపూర్ వాగుపై గల బ్రిడ్జి నుండి నిత్యం వందల గ్రామాల ప్రజలు వాహనాలపై వెళ్తుంటారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు యశ్వంతపూర్ రైలు ప్రమాదం గుర్తుకువస్తుంది. యశ్వంతపూర్ రైలు ప్రమాదం జరిగి 69 ఏళ్ల దాటిన అదే వాగుపై రోడ్డు బ్రిడ్జి నిర్మించాలని పాలకులకు ఆలోచన రాకపోవడం వారి నిర్లక్ష్యమే కారణం.వాగు ఉధృతంగా సాగినప్పుడు ప్రయాణికులను బ్రిడ్జిపై నుండి వెళ్లకుండా చిన్నమాదూరు ద్వారా పాలకుర్తి తదితర మండలాలకు వెళ్లే ప్రయాణికులు వెళుతున్న పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు అనేక అవస్థలకు గురవుతున్నారు. గతంలో పది సంవత్సరాలు పరిపాలించిన టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఈ బ్రిడ్జి మిగిలింది.

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సింగారపు రమేష్

కలెక్టర్ హామీ ఇచ్చిన బ్రిడ్జి నిర్మాణం కాలే :

ఎదునూరి మదార్, ప్రజాసంఘాల నాయకులు



యశ్వంతపూర్ వాగుపై నీటి ప్రభావం ఉధృతంగా పారుతున్న సమయంలో స్వయంగా కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చినా బ్రిడ్జి నిర్మాణం నేటికీ పూర్తికాలే. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా స్థానిక సమస్య అయిన ఈ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించకపోవడం విచారకరం.రెండు నియోజకవర్గాలకు 200పైన గ్రామాలకు అత్యంత ముఖ్యమైన రహదారిగా ఉన్న ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

వేసవి దుక్కులతో రైతులకు మేలు

- వాలుకు అడ్డంగా భూమిని దున్నాలి
- లోతు దుక్కులతో భూసారం అధికం, చీడపీడల నివారణ



కుమార్ యాదవ్, మండల వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-తొర్రూరు

వేసవికాలం ప్రారంభమైంది. ఈ సమయంలో ఖాళీ పొలాలను దున్నుకుంటే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. పంట పొలాల్లో ఉన్న కట్టెలు, చెత్తాచెదారాన్ని తొలగించుకోవాలి. అయితే నేలను దున్నకుండా వదిలేయకూడదు. వేసవి దుక్కులతో చాలా ఉపయోగాలు ఉన్నాయి. ఈ విషయాలపై తొర్రూరు మండల వ్యవసాయ శాఖ అధికారి కుమార్ యాదవ్ ఇస్తున్న సలహాలు సూచనలు రైతుల కోసం 'నవతెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

దుక్కులు చేయకుండా వదిలేస్తే....

పంటలు చేతికి వచ్చాక మళ్లీ సాగు చేసే వరకు భూమిని ఖాళీగా ఉంచడం మంచిది కాదు. భూమిని ఖాళీగా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహిస్తాయి. తద్వారా భూమిలో సత్తువ లేకుండా పోతుంది.

లోతుదుక్కులతో మరింత మేలు...

భూమిని లోతుగా దున్నడంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. తొలకరి వర్షాలకు ముందే భూమిని వాలుగా, అడ్డంగా, లోతుగా దున్నాలి. ఇలా చేస్తే భూమిపై పొరలు కిందికి, కింది పొరలు పైకి తేలి భూసారం పెరుగుతుంది. వానలు పడినప్పుడు నీరు బాగా ఇంకి తేమశాతం అధికంగా ఉంటుంది. అలాగే కలుపును బాగా నివారించవచ్చు. అంతే కాకుండా భూమి కోతకు గురి కాదు.

పశువుల మందల ఒడిగింపు తప్పనిసరి...

వేసవి దుక్కిదున్నే ముందు గొర్రెలను, మేకలను ఖాళీ పొలాల్లో ఒడిగించాలని అవి విసర్జించే మల, మూత్రాలు భూమిలోకి చేరి భూసారం పెరుగుతుంది. దీంతో పంటల్లో సూక్ష్మ పోషకాల లోపాలు నివారించుకోవచ్చు. అవకాశం ఉంటే కంపోస్టు లేదా చెరువు మట్టి పొలంలో చల్లితే పంటలకు మరింత మేలు జరుగుతుంది.

కలుపు యాజమాన్యం...

సాధారణంగా పంట లేని సమయంలో పొలంలో కలుపు మొక్కలు పెరగడం సహజం. ఈ కలుపు మొక్కలు నేలలోని నీరు, పోషకాలను ప్రత్యక్షంగా గ్రహించి పంట దిగుబడి తగ్గిస్తాయి. అనేక రకాల పురుగులకు, శిలీంద్రాలకు కలుపు మొక్కలు ప్రత్యామ్నాయంగా పని చేస్తాయి. దిక్కుల వల్ల కలుపు మొక్కలు, వాటి విత్తనాలు నేలపై పొరల్లోకి చేరి ఎండకు ఎండి నశిస్తాయి.

దుక్కులతో తెగుళ్ల నివారణ...

అనేక రకాల పురుగులు పంట కోత తర్వాత వాటి నిద్రావస్థ దశలను నేలలో, చెత్తాచెదారంలో, వరి కొయ్య కాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలిగించే శిలీంద్రాలు భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వాటి శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. ఈ దశలో లోతుగా దున్నితే భూమిలో ఉన్న చీడపురుగులో కోశాలు, గుడ్లు, లార్వాలు, ప్యూపాలు బయట పడి అధిక ఉష్ణోగ్రతకు గురై చనిపోతాయి. ఏమన్నా మిగిలిపోయిన పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. దుక్కులతో లోపలి పొరల్లో ఉన్న శిలీంద్ర బీజాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి ఆ సమయంలో అధిక ఉష్ణోగ్రతకు గురై వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోతాయి. సూచనలు పాటించి అధిక దిగుబడిని పొందవచ్చు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు





నవతెలంగాణ-గార్ల

మండల కేంద్రంలోని ఆర్‌సియం చర్చి ఫాదర్ దిలీప్ కుమార్ అధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ చర్చిల్లో క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి విచారణ గురువు దీలిప్ కుమార్ మాట్లాడుతూ మానవాళి కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను క్రైస్తవ సోదరులకు వివరించారు. ఏసుక్రీస్తు శిలువను మోస్తూ, ఆరాధన గీతాలు ఆలపిస్తూ పట్టణ పురవీధులలో శిలువ యాత్ర నిర్వహించారు.ఈకార్యక్రమంలో సహాయ గురువు కిరణ్, బ్రదర్ లారెన్స్, సిస్టర్స్, వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవ భక్తులు, సంఘస్థులు తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం రూరల్ : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్లో అగాపే ఫుల్ గాస్పల్ చర్చిలో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పాస్టర్స్ అండ్ లే లీడర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ పిల్లి కుమారస్వామి మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవాళి రక్షణ కొరకు సిలువపై తన విలువైన రక్తమును చిందించి చనిపోయిన రోజునే ప్రపంచమంతా గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటున్నారన్నారు. భక్తులందరూ ప్రార్థనలు చేసి, కీర్తనలు ఆలపించి, సిలువ మీద ఏసు ప్రభువు పలికిన మాటలను ధ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో డోలి రాములు, సరిత, చేతి సతీష్, సంతోష్, పూస అంజయ్య, పూస వెంకటేశ్వర్లు, పిల్లి వేణు,కర్ర నరసింహ రెడ్డి, పూస యాకాంబ్రం, వరిపెల్లి దయాకర్, ప్రశాంత్, పవన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ముస్లిం పేద కుటుంబాన్ని ఆదుకున్న కుల సంఘం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం పట్టణ శివారు బ్రహ్మంగారి తండా కాలనీ ఆటో డ్రైవర్ మహ్మద్ ఆజం ఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం కేసముద్రం మండల ముస్లిం కులసంఘం ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం, 7500 రూపాయల నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు షేక్ ఖాదర్ మాట్లాడుతూ ముస్లిం కులంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా కమిటీ తరఫున మావంతు సహాయంగా ఆదుకుంటామని, కొంతమంది తమ స్వార్థం కోసం, మండల కమిటీని విమర్శిస్తున్నారని, వారు పునరాలోచన చేసుకుని మండల ముస్లిం కమిటీకి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మహమ్మద్ హఫీజ్, షేక్ నయీం, షేక్ అక్బర్, షేక్ మైబు సుభాని, షేక్ బాషుమియ, మహ్మద్ యాకూబ్ పాషా, షేక్ సర్వర్, షేక్ సలీం, మహ్మద్ గఫార్, మహ్మద్ యాకూబ్‌పాషా, మహ్మద్ జావిద్,మహ్మద్‌రఫీ,మహ్మద్ ఆషీద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com

ఉపాధ్యాయునికి మేరు సంఘం ఆధ్వర్యంలో సన్మానం



నవతెలంగాణ-బయ్యారం

మండల మేరు సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పోల్కం శంకర్‌ను మండలాధ్యక్షులు గట్ల గణేష్ శాలువాతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా, ప్రధాన ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను విద్యా కుసుమాలుగా మహోన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాట వేసి విద్యా మార్గదర్శకాలను తరగతి గది బోధనలను గుర్తు చేసుకుంటూ పదవీ విరమణ జరుపుకుంటున్న పోలకం శంకరయ్య-ప్రమీలకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఎంపీటీసీ లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి వెన్ను వేణు, రామగిరి రమేష్, కీర్తి ఉదయ్, రామగిరి రవి, వెంకటేశ్వర్లు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ బిందు



నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని బాల్యతండ గ్రామానికి చెందిన బానోత్ రాజు-జ్యోతిల కుమార్తె సోనియా వివాహ వేడుకల్లో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా జెడ్పీ చెర్‌పర్సన్ బిందు నాయక్ పాల్గొని నూతన వధూవరులు సోనియా-కళ్యాణ్‌లకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అంగోత్ శ్రీకాంత్ నాయక్, జర్పుల శ్రీను, అజ్మీరా దేవోజి, బానోత్ రాజేష్, భూక్యా నరేష్, భూక్యా శ్రీను, అజ్మీరా శ్రీకాంత్, అజ్మీరా శంకర్, అజ్మీరా కోటి, భూక్యా రమేష్, గుగులోత్ రమేష్, అంగోత్ రమేష్, రాము, భూక్యా వీరన్న, బానోత్ మంత్రియ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంచినీటి నల్లాలు, బావులను పరిశీలించారు. ఐదు రోజులకోసారి తాగునీరు వస్తుందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.రోజు విడిచి రోజు తాగునీరు అందించేలా చర్యలుతీసుకోవాలని,నల్లాద్వారా సరఫరా అయ్యే మంచినీరు లీకేజీలు లేకుండా, కలుషితం కాకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలగకూడదని, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పట్టణ వాసులకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



వీరన్న కుటుంబానికి జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని బాలాజీపేట పరిధిలోని తీత్రీ తండాలో డాక్టర్ బానోత్ వీరన్న తండ్రి బానోత్ బిచ్చ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బిందు నాయక్ బిచ్చ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అం గోత్ శ్రీకాంత్ నాయక్, జరుపుల శ్రీను, అజ్మీరా దేవోజి, అజ్మీరా కోటి, రామచంద్రుల గోపాల్ రావు, భూక్యా శ్రీను, అంగోత్ శ్రీను, జర్పుల రాము, గుగులోత్ చిరంజీవి, అజ్మీరా శ్రీకాంత్, కళ్యాణ్, బానోత్ మంత్రియ తదితరులు పాల్గొన్నారు.

కిరాణా వ్యాపారి శ్రీనివాస్ మృతి

- చాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా వర్తక సంఘం ప్రతినిధుల సంతాపం

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు పట్టణానికి చెందిన పద్మ కిరాణం యజమాని దొడ్డ శ్రీనివాస్ మృతి పట్ల కిరాణ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. మృతుడు దొడ్డ శ్రీనివాస్ గతంలో కిరాణా మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో పలు పదవుల్లో పని చేశారు. గత పది రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారని, సేవా కార్యక్రమాల్లో ముందుండేవారని కందుకూరి హరిప్రసాద్, నంగునూరి శ్రీనివాస్ అన్నారు. సంతాపం తెలిపిన వారిలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్, కార్యదర్శి బోనగిరి శంకర్, కోశాధికారి చిదురాల శ్రీనివాస్, కిరాణా సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, కార్యదర్శి రమేష్, కోశాధికారి దేవేందర్, సలహా కమిటీ సభ్యులు టి.సదాశివరావు, తోట శ్రీనివాస్, నూనె మోహన్ రావు, హరి శంకర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ రక్షణ యాత్రను... విజయవంతం చేయండి

- జాతీయ మాల మహానాడు మండలాధ్యక్షులు కారం ప్రశాంత్

నవతెలంగాణ-నెల్లికుదురు

ఏప్రిల్ 2 నుండి 8వ వరకు జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించబోయే రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు మండలాధ్యక్షుడు కారం ప్రశాంత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు అద్దంకి సైన్యం యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు గారా ఉపేందర్‌తో కలిసి సంబంధిత కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామికవాదులు బుద్ధి జీవులు రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలిపి రాజ్యాంగ రక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. ఏప్రిల్ 8న హైదరాబాదులో ముగింపు రాజ్యాంగ రక్షణ యాత్ర సదస్సు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని దీనికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి సైన్యం యువసేన మండలాధ్యక్షులు బాణాల సంజీవ, నెల్లికుదురు గ్రామాధ్యక్షులు బూర్గుల రజిని కుమార్, బోటిమంచి యాకయ్య, కారం రవి, బాణాల వీరన్న, గార అనిల్, గార వరుణ్, జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో తొర్రూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంచు సంతోష్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్యం గురించి తగు జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు సంతోష్, పట్టణాధ్యక్షులు సోమ రాజశేఖర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ నుంచి తప్పు కోవట్లేదు... పార్టీ మారడం లేదు...

- పోరాటం నా రక్తంలోనే ఉంది
- ఫేక్ న్యూస్ నమ్మదు : ఎంపీ మాలోతు కవిత



నవతెలంగాణ-మహబూబాబాద్

పోరాటం నా రక్తంలోనే ఉంది.. పోటీ నుంచి తప్పుకోవడం లేదు.. పార్టీ మారడం లేదు.. నాపై వస్తున్న ఫేక్ న్యూస్‌ను నమ్మొద్దు ... పోటీలో ఉంటా గెలిచి చూపిస్తా.. పార్లమెంట్ నియోజకవర్గంలో రాజకీయాల కతీతంగా నాకు మద్దతు ఉందనిమహబూబాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీకి తండ్రి కూతుర్లు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి డిఎస్ రెడ్యానాయక్ ఆయన కూతురు బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి ఎంపీ మాలోత్ కవిత పార్టీ మారుతారని, ఎంపీ అభ్యర్థిత్వం నుంచి తప్పుకుంటారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మాలోతు కవిత మీడియాతో మాట్లాడుతూ తాను పార్టీ మారడం లేదని ఎంపీ అభ్యర్థిత్వం నుంచి తప్పుకోవడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కే.కేశవరావు ఆయన కూతురు విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరడానికి నిర్ణయించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు ప్రకటన చేశారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌కు చెందిన సీనియర్ నాయకులు ఐదు దశాబ్దాల రాజకీయ నేపథ్యం ఉన్న ఉద్దండుడు డిఎస్ రెడ్యానాయక్ ఆయన కూతురు ఎంపీ మాలోత్ కవితపై అనేక ఊహగానాలు వచ్చాయి. వాస్తవంగా ఈ తండ్రీ కూతుర్లు తొలుత కాంగ్రెస్‌లో నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారే. డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వైయస్సార్ ప్రభుత్వ హయాంలో సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖమంత్రిగా పనిచేసిన రెడ్యానాయక్, కూతురు మాలోతు కవిత 2009 ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గం పునర్విభజనలో ఎస్టీలకు రిజర్వ్అయింది. తండ్రి సహాయ సహకారంతో 2009లో కాంగ్రెస్ టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదే ఎన్నికల్లో కూతురు గెలవగా తండ్రి రెడ్యా నాయక్ ఓటమి చెందారు. 2014 ఎన్నికల్లో డోర్నకల్ నుంచి రెడ్యానాయక్, మహబూబాబాద్ నుంచి మాలోతి కవిత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారు. ఎన్నికల్లో రెడ్యానాయక్ గెలుపొందగా కవిత ఓటమి చెందారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2015లో రెడ్యానాయక్ మాలోతు కవితలు బీఆర్ఎస్‌లో చేరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై రెడ్యానాయకు గెలుపొందారు. 2019 ఎన్నికల్లో పార్లమెంటు మహబూబాబాద్ అభ్యర్థిగా ఎంపీ మాలోతి కవిత బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. ఈ క్రమంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్యా నాయక్ ఓటమి చెందారు. ప్రస్తుతం ఎంపీ పదవిలో మాలోతు కవిత ఉన్నారు. 2023 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో గతంలో వివిధ హోదాల్లో పనిచేసిన రెడ్యానాయక్, మాలోత్ కవిత పార్టీ మారుతారని వారి కోసం కాంగ్రెస్ ద్వారాలు ఎప్పటికీ తెరిచి ఉంటాయని అందరు భావించారు.పలు సందర్భాల్లో పార్టీ మార్పుపై ఊహాగానాలు వినిపించాయి. కానీ వారి నుంచి ఎలాంటి సంకేతాలు లేవు. తాజాగా కేశవరావు, కడియం శ్రీహరి కుటుంబ సభ్యులతో సహా బీఆర్ఎస్‌కు దూరమై కాంగ్రెస్‌కు చేరువవుతున్న నేపథ్యంలో రెడ్యానాయక్, కవిత భవితవ్యంపై అనేక వార్తలు పుట్టుకొచ్చాయి. కానీ తాను పార్టీ మారడం లేదని అభ్యర్థిత్వం నుంచి తప్పుకోవడం లేదని, పోటీలో ఉంటానని, గెలిచి చూపిస్తానని ఎంపీ నాలోక కవిత ధీమా వ్యక్తం చేశారు . అయినప్పటికీ జిల్లాలో రాజకీయం హాట్ హాట్‌గా ఉంది. ఎప్పటికైనా ఏదైనా జరగొచ్చు అని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ఉత్కంఠకు కాలమే పరిష్కారం చెబుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు





నవతెలంగాణ-గార్ల

ప్రభుత్వ నిషేధిత నాటు సారాను తయారు చేసిన, అమ్మకాలు చేపట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గార్ల-బయ్యారం సిఐ రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని శేరిపురం గ్రామంలో నాటు సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల గుడుంబా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటు సారా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ రవి కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మంగిలాల్, శ్రీనివాస్, రాము, భద్రు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని కోయగూడెం, చుంచుబంధం తండాల్లోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. కిరణ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నీరజ, ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, కిరీటి, మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎన్డీ ఆధ్వర్యంలో బిచ్చాకు ఘన నివాళులు

నవతెలంగాణ-బయ్యారం

ప్రజల కోసం పని చేసిన బిచ్చ అమరత్వం మరుపురానిదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధు, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. అమరత్వం పొందిన బానోతు బిచ్చ మృత దేహంపై ఎర్రజెండాను కప్పి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. మండలంలోని బాలాజీపేట గ్రామపంచాయతీ తీత్రి తండాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు బానోతు బిచ్చా ప్రజల కోసం అనునిత్యం పోరాటం చేసిన ధన్యుడని అన్నారు. ఎన్ని నిర్బంధాలు వచ్చినా వెనకడుగు వేయకుండా పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తన వంతు కృషి చేశాడని పేర్కొన్నారు. ఈ సంతాప సభలో బండారు ఐలయ్య, జడ సత్యనారాయణ, పద్మ, మురళి, రవి, నాదెండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బావుసింగ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-గూడూరు

ఇటీవల మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బావు సింగ్ నాయక్ కుటుంబాన్ని మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్, ప్రభుత్వ చీఫ్ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామ్ చంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్‌లు శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మృతుడి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టి వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపాల్ రెడ్డి, జిల్లా నాయకులు వాంకుడు కొమ్మాలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు తూము మల్లయ్య మృతి

నవతెలంగాణ-మరిపెడ

మండలంలోని చిలంచర్ల గ్రామానికి చెందిన తూము మల్లయ్య (55) గురువారం ఉదయం హైదరాబాదులో మృతి చెందారు. తూము మల్లయ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఐటీయూ జిల్లా నాయకునిగా, సీపీఎం ఆర్గనైజర్‌గా, మండల కమిటీ సభ్యునిగా పనిచేశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై షుగరు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని సీపీఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరన్న అన్నారు. ఆయన మల్లన్న మృత దేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలతో నివాళులు అర్పించారు. మల్లన్న లేని లోటు వారి కుటుంబానికి కాదు మా పార్టీకి మా ఉద్యమానికి కూడా లోటుగానే ఉంటుందని ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కామ్రేడ్ మల్లన్న చిన్నతనం నుండి ఎర్రజెండాకు ఆకర్షితులై ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో ఉద్యమాలు నడిపించారని, మండలంలో పార్టీ ఎర్రజెండాను చేబుని పార్టీ చేస్తున్న రైతు వ్యవసాయ కార్మిక కర్షక పోరాటాలలో జనాన్ని చైతన్యం చేసి వారు ముందుండి నడిచారని వారు అన్నారు.

వివిధ రంగాల కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ కార్మికుల కర్షకుల గుండెల్లో నిలిచిపోయారని వారన్నారు. మల్లన్న భౌతికంగా మన మధ్యన లేకపోయినా మల్లన్న ఆశయాలను వారి కలలను ముందుకు తీసుకుపోవడానికి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అందరూ ముందుండాలని వారు పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుండి వీరన్న, మండల నాయకులు బాణాల రాజన్న, కందాల రమేష్, అల్లి శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, పాల్వాయి రామన్న, దొంతు సోమన్న, కొయ్యడ రామయ్య, బత్యం శ్రీను, పాల్వాయి దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కంఠమహేశ్వరునికి జలాభిషేకం

నెల్లికుదురు : మండలంలోని వావిలాల గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర నూతన ఆలయం, విగ్రహాల ప్రతిష్టాపన, కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠమహేశ్వర స్వామికి, రేణుకాఎల్లమ్మ, వనం మైసమ్మలకు శుక్రవారం భక్తి శ్రద్ధలతో వేదమంత్రోచ్చరణల మధ్య జలాభిషేకం గౌడ కులస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, డీజే డ్యాన్సులతో గ్రామంలోని గౌడ లందరూ జలంతో నిండిన కొత్త రాగి బిందెలను ఎత్తుకొని, మహిళలు పూజా ద్రవ్యాలను తీసుకురాగా వైభవోపేతంగా ప్రదర్శనగా స్వామి వారి ఆలయానికి ప్రదక్షిణలు చేసి జలాభిషేకం నిర్వహించారు. దీంతో వావిలాల గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. శనివారం బోనాల ను చేసి దేవతలకు మొక్కలు చెల్లించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గౌడ కులస్తులు తెలిపారు.

దందాలు చేసే సంస్కృతి ఝాన్సీ రెడ్డికి లేదు

- పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్

నవతెలంగాణ-తొర్రూరు



అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇసుక, గ్రానైట్ ఇతర దందాలు చేసే సంస్కృతి ఝాన్సీ రెడ్డికి లేదని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డిలతో కలిసి కాకిరాల హరిప్రసాద్ మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇసుక, మైనింగ్, భూదందాలు చేస్తుందని ఝాన్సీ రెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నేతలకు, ఇతర నాయకులకు అక్రమ ఆదాయంపై ఆలోచనలు ఉంటాయే కానీ నిస్వార్థ నాయకురాలికి ఉండవన్నారు. వరైనా ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు చూపించాలన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీ రెడ్డిలు నియోజకవర్గ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని, వారి సంకల్పానికి ప్రజలు సహకారం అందించాలన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణాధ్యక్షుడు సోమ రాజశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, మెరుగు మల్లేశం గౌడ్, మచ్చ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, బిక్షం గౌడ్, నల్లపు వెంకన్న, నల్లపు రాజు, పెండ్లి మహేందర్ రెడ్డి, నల్లతీగ రవి, బ్రిజ్జాల అనిల్, దేవేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి





నవతెలంగాణ-గూడూరు

మండల కేంద్రంలోని మసీదులో శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి బలరాం నాయక్, ప్రభుత్వ చీఫ్ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ రంజాన్ ఒక పవిత్రమైన పండుగ అని, మానవ సేవ చేయాలన్న సందేశాన్ని మానవాళికి అందించే పండుగ అని తెలిపారు. రంజాన్ మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవాసం క్రమశిక్షణను ఆధ్యాత్మికతను పెంపొందిస్తుందని ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లింలు తమ పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని అల్లాను కోరారు. సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎంపీ అభ్యర్థిని ఎమ్మెల్యేలను శాలువలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిట్ట వెంకన్న, మైనార్టీ సెల్ అధ్యక్షులు రసూల్, మైనార్టీ మత పెద్దలు సలీం, యాకుబ్ పాషా, ఖదీర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బైండ్లను పూజారులుగా గుర్తించాలి

నవతెలంగాణ-నెల్లికుదురు



గ్రామ దేవతలకు పూజలు నిర్వహించే వారిని పూజారులుగా ప్రభుత్వం గుర్తించి గౌరవ వేతనం అందివ్వాలని బైండ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిలకర యాలాద్రి ప్రభుత్వం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన బైండ్ల కులస్తుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నో రకాలైన గ్రామదేవతలు ఉంటారని వారిని బైండ్ల కులస్తులు మాత్రమే పూజ నిర్వహిస్తారని అన్నారు. అలా పూజలు నిర్వహించే వారిని ప్రభుత్వం పూజారులుగా గుర్తించి గౌరవేతను ఇచ్చి ఆదుకోవాలని, బైండ్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధికంగా నిధులు కేటాయించి వారి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీలకర్ర యాకయ్య, జిలకర వీరన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీయుత గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి
కోర్టు-సత్తుపల్లి
హెచ్.ఎం.ఓ.పీ నెం: 105/2023

బిట్వీన్,
బొడ్డు కళ్యాణి అలియాస్ కాకా కళ్యాణి
.....వాది
మరియు
బొడ్డు రవీందర్ ..... ప్రతివాది

టూ,
బొడ్డు రవీందర్, తండ్రి భిక్షం, వయసు : 32, వృత్తి: వ్యవసాయం, నివాసం: మన్నెగూడెం గ్రామం, చిన్నగూడూరు మం॥ మహబూబాబాద్ జిల్లా.

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, బొడ్డు కళ్యాణి అలియాస్ కాకా కళ్యాణి శ్రీయుత గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి, సత్తుపల్లి వారి కోర్టులో హెచ్.ఎం.ఓ.పీ నెం: 105/2023తో విడాకుల మంజూరు కొరకు మీపై పిటీషన్ వేసియున్నారు. మీ హాజరు నిమిత్తం **ది.18-04-2024న వాయిదా పడిఉన్నది. మీరు ది. 18-04-2024 తేదీన ఉదయం గం.10:30ని॥లకు** స్వయముగా కానీ ప్లీడర్ ద్వారా కానీ పైన పేర్కొనబడిన కోర్టువారి సమక్షము లో హాజరు కాగలరు. లేని యెడల పిటీషన్ మీ పరోక్షములో తీర్మానించబడును

//కోర్టువారి అనుమతితో//

సత్తుపల్లి,
తేదీ: 29-03-2024

రాచూరి సీతారామయ్య, అడ్వకేట్
సత్తుపల్లి, ఖమ్మం జిల్లా

మార్చిలోనే మండుతున్న ఎండలు

ఎండ వేడిమికి అల్లాడుతున్న జనం

నవతెలంగాణ-మల్హర్‌రావు



ఎండలు మండుతున్నాయి. మార్చిలోనే మే నెలను తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి ఎండల తీవ్రత పెరుగుతుండటంతో జనం అల్లాడుతున్నారు. మండల వ్యాప్తంగా మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. గతేడాది మార్చితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో గాలిలో తేమశాతం కూడా 20 శాతానికి పడిపోయింది. ఎండలకు తోడు భూగర్భజలాలు కూడా అడుగంటడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం జంకుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా తడుక కుమార్ గౌడ్

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన తడుక కుమార్ కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఐత ప్రకాశ్ రెడ్డి సంబంధిత పత్రం అందజేశారు. అనంతరం తడుక కుమార్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, చిట్యాల మండల అధ్యక్షులు గుట్ల తిరుపతి, చిట్యాల మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ ముల శంకర్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఎండుతున్న పంటలు... పట్టించుకోని పాలకులు..!

- ఎస్సారెస్పీ కాలువలు, తెగిన చెరువులకు మరమ్మతులేవీ ?
- చర్యలు తీసుకుని సాగునీరందించాలి
- బాధిత రైతుల వేడుకోలు

నవతెలంగాణ-చిట్యాల





చిట్యాల, రేగొండ, టేకుమట్ల మండలాల చివరి ఆయకట్టు వరకు చిట్యాల మండలం జూకల్, గుంటూరుపల్లి, తిరుమలపురం, రామచంద్రాపురం, మండలలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎస్సారెస్పీ కాలువ- డీబీఎం 38పైనే ఆధారపడి పంట సాగు చేశారు. సుమారు 500మంది రైతులు దాదాపు 2000 ఎకరాల్లో వరి, మొక్కజొన్న మిరప, తదితర పంటలు సాగు చేశారు. గత సంవత్సరంలో కురిసిన భారీ వర్షాల కారణం గా ఎస్సారెస్పీ కాలువలు, చెరువులు పూర్తిగా ధ్వంసమై పిచ్చి మొక్కలు చెత్తా చెదారంతో కాలువ నిండి పోయింది. వరద నీటి ప్రవా హానికి తెగిపోయిన కాలువలు, చెరువులు, కుంటలనే నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో సాగు నీరందక కష్టాలు తప్పడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సా రెస్సీ కాలువల ద్వారా చెరువులు నింపేది. దీంతో రైతుల బావుల్లో నీరు ఉండడం వల్ల ఎలాంటి ఇబ్బం దులు తలెత్తలేదు. ఈ సంవ త్సరం చెరువులు, కాలువలు తెగిపోయి నీరు లేక భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిబిఎం 38 కాలువ చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లే పరి స్థితి లేక పంటలు కాపాడుకునేందుకు రైతులు హరిగోస పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికా రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతులు చేపట్టి నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని వేడుకుంటున్నారు.

వెంటనే మర్మతులు చేపట్టాలి



గతంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరు వచ్చేది. ఈ యాసంగి సీజన్ ఇప్పటివరకు కాలువ నీరు రాలేదు.గత సంవత్సరం భారీ వర్షాల కారణంగా ఎస్సారెస్పీ బీబీఎం-38 కాల్వ పూర్తిగా ధ్వంసం అయింది. 10 రోజుల కిందట మరమ్మతులు చేస్తున్నామని చెప్పి విస్మరించారు. ఇప్పటి వరకు అమరమతులు చేపట్టలేదు. రానున్న రోజుల్లో నేటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది . అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టి సాగు నీరు అందించాలి.

-సదాశివరావు, రైతు, గుంటూరుపల్లె

కాలువకు గండికొట్టిన వారిని శిక్షించాలి

పీఏసీఎస్ డైరెక్టర్ సప్పిడి ఆదిరెడ్డి



నవతెలంగాణ-గోవిందరావుపేట

దొంగతనంగా రాత్రి సమయంలో రంగాపురం కాలువకు గండి పెట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పీఏసీఎస్ డైరెక్టర్ సప్పిడి ఆదిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కోట కాలువ రైతులు కాలువకు గండిపడిన ప్రదేశాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ అక్రమ సాగుదారులు ఈ దారుణానికి ఒడిగడుతున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారుల అండదండలతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని , ముందు ముందు ఎకరం పొలం ఎండిన నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి సుమారు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెడిదే నీరందక పొలాలు బీటలు వారుతున్నాయని అన్నారు. సాగునీటి కోసం రేపటి నుండి ఆందోళన కార్యక్రమాలు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ఐ కూడా కాలువ గండిని పరిశీలించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు : జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-గణపురం

రైతులు అధైర్య పడొద్దని, చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తామని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా అన్నారు. శుక్రవారం గణపసముద్రం చెరువును పరిశీలించారు. అనంతరం రైతులు, ఐబీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు. సాగునీరు తాగు నీరుకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. మిషన్ భగీరథ నీటితో గణపసముద్రం చెరువు ఎండిపోతుందనే భ్రమను తీసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ బసవ ప్రసాద్‌గౌడ్, ఏఈ మహేందర్, సమ్మయ్య రైతులు, ఎంపీటీసీ మోటాపోతుల శివ శంకర్ గౌడ్, సిరిగినేని బాబురావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

13న విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



నవతెలంగాణ-రేగొండ

ఏప్రిల్ 13 తేదీన గణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో గురు దత్త విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వేద పండితులు కళ్యాణ్ చర్మ తెలిపారు. మండలంలోని చిన్నకోడపాక గ్రామంలో నిర్మించిన శ్రీ గురుదత్త దేవాలయాన్ని శుక్రవారం సందర్శించి విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి హాజరవుతారని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు చక్రవర్తి చర్మ దిలీప్ శర్మ, మహేష్ శర్మ వామన్‌రావు, రాజేంద్రప్రసాద్, వాలంటర్లు బండారి సదానందం, సాదు మహేందర్, బోట్ల లక్ష్మీరాజ్యం, బండారు కుమారస్వామి, బండారు రవీందర్, బైరి రాజిరెడ్డి, సతీష్, వీర చారి, జనార్ధన్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత... వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-చిట్యాల

ప్రభుత్వ నిషేధిత గుడుంబాను పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని పాసిగడ్డ తండ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిం చారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన లావుడ్య వనక్క పాసిగడ్డ తండా గ్రామ శివారులో బెల్లం పానకం పెట్టి గుడుంబా తయారు చేస్తుందనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. ఒక డ్రమ్ములో 250 లీటర్ల బెల్లం పానకం ఒక క్యాన్ లో 10 లీటర్ల గుడుంబా లభించగా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి గుడుంబా సీజ్ చేసి వణక్క పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిషేధిత గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ యాకయ్య పిసీలు నవీన్, అస్లాం జానీ, తదితరులు పాల్గొన్నారు.

'చేతి పంపులకు మరమ్మతులు'

నవతెలంగాణ-గణపురం



గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారించేందుకే చేతి పంపులు మరమ్మతు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం మండలం లోని అప్పయ్యపల్లి గ్రామపంచాయతీలో యూపీఎస్ పాఠశాల వద్ద చేతిపంపు మరమ్మతు చేపట్టారు. ఎంపీడీవో ఎల్ భాస్కర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉన్న చెడిపోయిన బోరు పంపులను మెకానిక్ గడ్డం భిక్షపతి ఆధ్వర్యంలో మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సౌకర్యం కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వైద్యులు.. దైవ సమానులు : ఎమ్మెల్యే జీఎస్సార్

- శ్రీ దివ్య హాస్పిటల్ ప్రారంభం

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



సమాజంలో వైద్యవత్తి పవిత్రమైనదని, వైద్యులు దైవ సమానులని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డులో డాక్టర్ వి దివ్య ఎంఎస్ జనరల్ సర్జన్, కోరిమి రవితేజ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దివ్య హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా లాంటి వెనుకబడిన ప్రాంతంలో వైద్యు లుగా పనిచేయడం అనేది పేద ప్రజలకు సేవ చేసినట్టేనని అన్నారు. ఈ ప్రాంతంలో వ్యాపార ధోరణితో కాకుండా ప్రజా సేవతో ప్రజలకు సేవ చేయాలని సూ చించారు. పేదలు అధికంగా ఉన్నారని వారికి తగిన సమయంలో వైద్యం అందించి మన్ననలు పొందా లని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్ రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెంది ప్రజల మన్ననలు పొం దాలని అన్నారు. భూపాలపల్లి లాంటి పారిశ్రామిక అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో జనాభాకు అనుగు ణంగా ఇంకా ఎన్నో ఆసుపత్రులు రావాలని కోరారు. నూతనంగా ఏర్పాటుచేసిన హాస్పిట్ డాక్టర్ వి. దివ్య ను యాజమాన్యం హాస్పిటల్ సిబ్బందిని గండ్ర సత్య నారాయణరావు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరిమి రాజ్‌కుమార్, డాక్టర్లు కిరణ్, ప్రధాన్, గోపీచంద్, సీపీఐ జిల్లా సమితి నాయకురాలు కోరిమి సుగుణ, మున్సిపల్ వైస్ చైర్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్య దర్శి ఎం రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖ్యాత రాజు సతీష్, ఏఐటీయూసీ నాయకులు మాతాంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు అప్పం కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్య క్షుడు ఇస్లావత్ దేవన్, బుర్ర కొమురయ్య, సాంబ మూర్తి, కౌన్సిలర్లు శిరుప అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ద్రోహం చేసినోళ్లు కన్నతల్లికి ద్రోహం చేసినట్లే...

- జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగాజ్యోతి

నవతెలంగాణ - ములుగు



కష్టకాలంలో బీఆర్ఎస్‌కు ద్రోహం చేసినోళ్లు కన్నతల్లికి ద్రోహం చేసినట్లేనని జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగాజ్యోతి అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కడియం శ్రీహరి కూడా కన్న తల్లి లాంటి బీఆర్ఎస్‌ను మోసం చేశారని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కడియం శ్రీహరికి ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఉపముఖ్యమంత్రిగా అవకాశం కల్పిస్తే నేడు బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గు మాలిన చర్య అన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో తాటికొండ రాజయ్యకు కాకుండా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి కడియం శ్రీహరిని కెసిఆర్ గెలిపిస్తే పార్టీ మారడం. ఆయన సొంత స్వలాభం కోసమేనని ఆరోపించారు. వరంగల్ ఎంపీ టికెట్‌ను ఆయన కూతురు కావ్యకు ప్రకటించింది నిజం కాదా... ? టికెట్ ఇచ్చిన తర్వాత పార్టీ మారడం ఏంటని, వరంగల్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 14 ఏళ్ల పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బిఆర్ఎస్. ఎంతోమంది ఉద్యమకారుల, ప్రజలు బీఆర్ఎస్‌తో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మలక రమేష్, రామ సాయం శ్రీనివాస్ రెడ్డి, వేములపల్లి బిక్షపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన నాగులమ్మ జాతర

- 4రోజుల పాటు అంగరంగ వైభవంగా సుంకు పండగ వేడుకలు
- భారీగా హాజరైన సందర్శకులు

నవతెలంగాణ-మంగపేట







మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధి లక్ష్మీనర్సాపురం గ్రామంలో నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న నాగులమ్మ జాతర శుక్రవారం ఊరేగింపుతో ముగిసింది. బాడిశ వంశస్థులు, ఆలయ ప్రధాన పూజారులు రామకృష్ణ, నాగ రమేష్‌లు గిరిజన సాంప్రదాయాల ప్రకారం సుంకు పండగ నిర్వహించారు. జాతరలో చివరి రోజు నాగులమ్మ ఉత్సవ మూర్తిని లక్ష్మీనర్సాపూర్, రాజుపేట, వాగొడ్డుగూడెం గ్రామాలలో పల్లకిలో ఊరేగించారు. ఈ శోభ యాత్రను తిలకించడానికి మండల వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు గురువారం రాత్రి 11.45 నిమిషాలకు పూజారులు, వడ్డేలు నాగులమ్మ ఏల్పుల జెండాలకు ఆలయ ప్రాంగణంలో ఎదురుపూజలు చేసి జెండాలు ప్రతిష్ఠించారు. రాత్రి 2.15 నిమిషాలకు అమ్మవారికి సంబంధించిన డాలు గుడ్డ చరిత్రను కోయ పండితుడు నాగుల శ్రీరాములు వివరించారు. ఆదివాసీలు తమ సంస్కృతి సాంప్రదాయాలు, జీవన విధానం అద్దం పట్టేలా థింసా నృత్యాలు చేస్తూ ప్రత్యక ఆకర్షణగా నిలిచారు. ఆలయ ప్రధాన పూజారులు రామకృష్ణ స్వామి, నాగ రమేష్ పూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పూజారులు, వడ్డెలు మడకం లక్ష్మయ్య, సోడి సత్యం, మూయబోయిన శివ, కుర్సం పుల్లయ్య, ఈసం సమ్మక్క, కోర్స శ్రీకాంత్, చౌలం భవానీ, కట్టం సమ్మక్క, తుర్స చిన్నాబ్బాయి, సోడి శ్రీను, ఇర్ప రామకృష్ణ, కొమరం ధనలక్ష్మి, కొమరం పాపరావు, ఆదివాసీ కుల పెద్దలు కుర్సం విష్ణు మూర్తి, మడకం రాజేశ్వర్‌రావు, కోర్స ముసలయ్య, కారం సాంబయ్య, మడకం రమేష్, కుర్సం నరేష్ పాల్గొన్నారు.

తెలుగు వారి ఆత్మగౌరవం నిలబెట్టింది 'టీడీపీ'

- నియోజకవర్గ ఇన్‌చార్జి జనార్ధన్‌రావు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది కేవలం తెలుగుదేశం పార్టీ అని టీడీపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మక్కిరాల జనార్ధన్‌రావు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో పార్టీ వ్యవ స్థాపకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ రావు మాట్లాడుతూ... తెలుగువారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేందుకు, అభివృద్ధికి తారక రామారావు 42 సంవత్సరాల క్రితం టీడీపీని స్థాపించారని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పని చేసిన ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు పరిపాలన విధానం ఆదర్శనీయమని అన్నారు. నేడు తెలుగు రాష్ట్రాల్లో కులమత భావోద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన గత బీఆర్ఎస్, ప్రస్తుత వైసిపీ లు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తమ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలనే ప్రస్తుత పాలకులు పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ఎన్టీఆర్ ఆశయ సాధనకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మాచర్ల నగేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు దూడపాక సాంబయ్య, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బంటుపల్లి పాల్గుణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దోస్తు కుటుంబానికి ఆసరా..

రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిజ్ చేసిన మిత్రులు



నవతెలంగాణ - ములుగు

గుండెపోటుతో చనిపోయిన మిత్రుని కుటుంబానికి పదవతరగతి విద్యార్థులు ఆసరగా నిలిచారు. ములుగుకు చెందిన బండారు రమేష్ జనవరి 22న గుండెపోటుతో మృతిచెందగా 1992 పదవతరగతి బ్యాచ్ స్నేహితులు రమేష్ కుటుంబాన్ని పరామర్శించి శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. రమేష్ భార్య శ్రీసుమ, కూతురు వేద పేరున ములుగు పోస్ట్ కార్యాలయంలో జాయింట్ ఖాతాలో రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత బాండ్ పత్రాలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. గండ్రకోట కుమార్, కొత్తపల్లి పోషన్న, ఆరె విజేందర్, పైడిమల్ల గంగాధర్, భాస్కర్, సామల శివరాజ్, చింతనిప్పుల రవి, సూర లాల్ కష్ణ, సముద్రాల వెంకటేశ్వర్లు, కె.రాజమనోహర్ రెడ్డి, ఎండీ సలీం, నల్లెల వేణు, సిరంగి సతీష్, వెల్దండి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక శాఖ ములుగు జిల్లా డైరక్టర్‌గా శ్రీకాంత్‌ముదిరాజ్



నవతెలంగాణ -తాడ్వాయి

మత్స్య పారిశ్రామిక శాఖ ములుగు జిల్లా డైరెక్టర్‌గా బయ్యక్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలా శ్రీకాంత్ ముదిరాజ్ ను మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకుని సంబంధిత నియామక పత్రాన్ని అందజేశారు. శుక్రవారం ఎలా శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన మంత్రి సీతక్క, జిల్లా మహాసభ అధ్యక్షులు బుల్లు దేవేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ముదిరాజు కుటుంబాలకు నిత్యం సేవ చేస్తానని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్ధ రహితం : బీఆర్ఎస్



నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రజా సేవకుడు, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి,పెద్దపల్లి జెడ్పీ చైర్మెన్ పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్ధరహితం అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవ రెడ్డి, తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పుట్ట పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంథని నియోజకవర్గ ప్రజలకు సేవలందించినట్టు చెప్పానరు. కోరం లేకున్నా కాంగ్రెస్ సింగిల్ విండో డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టడం సిగ్గుచేటన్నారు. అవిశ్వాసం పెట్టి పిఏసిఎస్ కార్యాలయానికి హాజరు రాకుండా పారిపోవడం సరికాదన్నారు. అవిశ్వాసం పెట్టిన సభ్యులు బలప్రదర్శనకు రాకపోవడంపై సమాధానం చెప్పాలని అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ రుణాలు, ఎరువులు అందిస్తున్న తమపై అవాస్తాలు మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, ఎంపిటిసి-,1 రావుల కల్పన మొగిలి, నాయకులు తాజొద్దీన్, కుమార్, రాజయ్య పాల్గొన్నారు.